సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 3 । ఆగస్టు । 2024



‘ఓపెన్’గా చదువుకుందాం

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆగస్టు 27 వరకు అవకాశం కల్పించారు. - 8లో



అమ్మో.. ఆ మూడు మండలాలా!

ఆమదాలవలస, నందిగాం, సంతబొమ్మాళిలో తహసీల్దారు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వివిధ కారణాలతో ఈ పోస్టులు భర్తీ కావడం లేదు. - 8లో

దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల కంప్యూటర్ అకౌంటెన్సీ శిక్షణకు ఈ నెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య యువత అర్హులని. వివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

చంద్రబాబు కనుసన్నల్లోనే ఇసుక దోపిడీ

- వైఎస్సార్ సీపీ నాయకుడు చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: బూర్జ మండలం నారాయణపురం వద్దకు వందల సంఖ్యలో లారీలను గురువారం రాత్రి రప్పించి నాగావళి నదిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన టీడీపీ నాయకులు ఇప్పుడు గురివింద కథలు చెబుతున్నారని, ఈ దోపిడీ అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతోందని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి నారాయణపురం గ్రామానికి వందల సంఖ్యలో లారీలు చేరుకొని, నదిలో 5 మెషీన్లు దించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని బూర్జ మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఫొటోలు, వీడియోలు తీసి తనకు పంపించారన్నారు. వాటిని వెంటనే జిల్లా కలెక్టర్‌కు పంపించి ఫోన్లో మాట్లాడగా కలెక్టరు ఆదేశాలతో అధికారులు అక్కడికి చేరుకొని తవ్వకాలను నిలుపుదల చేశారని చెప్పారు. అయితే మెషీన్లు, లారీలను సీజ్ చేసి కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న టీడీపీ పెద్దల వ్యవహారం బయటకు తెలియాలన్నారు. నారాయణపురం ఆనకట్ట ఎగువన పేరుకుపోయిన మట్టి, బురద, ఇసుకను తొలగించడానికి ఇరిగేషన్ అధికారుల అనుమతి కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు దరఖాస్తు చేశారని, ఇంకా అనుమతులు రాలేదని, ఆ పేరు చెప్పి టీడీపీ పెద్దలు అక్రమ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. వర్షాకాలంలో మట్టి, బురద తొలగింపునకు ఎలా దరఖాస్తు చేస్తారని, దీనిపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, పార్టీ నాయకులు అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వాతంత్య్ర వేడుకలు

- అధికారుల సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పరేడ్ కార్యక్రమాన్ని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను ఇంజినీరింగ్ శాఖ, రెవెన్యూ డివిజనల్ అధికారి, స్థానిక తహశీల్దార్ పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. అవార్డులకు సంబంధించి ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, సుదర్శన దొర, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డీఎస్‌ఓ శాంతిశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశ్వరరావు, డీపీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సారవకోట: మండలంలో 24 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సారవకోట ఎంపీడీఓ రాంబాబు శుక్రవారం తెలిపారు. గురువారం పింఛన్ల పంపిణీకి సంబంధించి ఉదయం 6 గంటలకు లాగిన్ చేయాల్సి ఉన్నా జాప్యం చేయడంతో నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

సిక్కోలు ఇసుక..


సీఎం తాలూకా!



నదిలోని ఇసుక ర్యాంపు వరకు వేసిన గ్రావెల్ రోడ్డు

పెద్ద ప్లానే వేశారు!

- నారాయణపురం వంతెన సమీపంలో భారీగా ఇసుక దందా
- ప్రభుత్వ పెద్దల పాత్రపై అనుమానం
- అనుమతులు లేకుండానే జిరాయితీ భూముల్లో తవ్వకాలు
- ఒక్క రోజులోనే 300కిపైగా వాహనాలు రాక
- ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన యంత్రాంగం
- సిబ్బంది వెళ్లేసరికే 100కి పైగా వాహనాల్లో ఇసుక తరలింపు
- తాత్కాలిక చర్యలకే పరిమితమైన అధికారులు



‘మంత్రులు, ఎమ్మెల్యేలు ఇసుక జోలికి పోవద్దు. ఉచిత ఇసుకపై విధి విధానాలు రూపొందించలేదు. ఏ ఒక్క నాయకుడు ఇసుక విషయంలో తూలదూర్చొద్దు..’

ఇవీ మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలు..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కానీ, ఆయన పేరుతోనే శ్రీకాకుళం జిల్లా నారాయణపురం సమీపంలోని కాఖండ్యాం, చిన లంకాం గ్రామ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపారు. విజయవాడ, గుంటూరు నుంచి వచ్చిన వారు ఇక్కడున్న చిట్టి, శ్రీనివాసరావు తదితర పేర్లగల వ్యక్తులతో వ్యవహారం నడిపించారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వ నాయకుల్లో చాలా మంది ఈ మధ్య కాలంలో ఆ ఎమ్మెల్యే తాలూకా...ఈ మంత్రి తాలూకా అంటూ హడావుడి చేస్తున్న బ్యాచ్‌లాగే.. ఇక్కడ కూడా కొందరు సీఎం తాలూకా అని ఇసుక అక్రమ దందా సాగించారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తప్పని పరిస్థితుల్లో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తవ్వకాలకు తాత్కాలికంగా చెక్ పెట్టారు. కానీ, నిర్వాహకులపై సీరియస్ చర్యలు తీసుకోలేదు. దీని వెనక పెద్దల పాత్ర ఉండటమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిరాయితీ భూముల్లో ర్యాంపునకు రాచబాట

బూర్జ మండలం నారాయణపురం సమీపాన చిన లంకాం, కాఖండ్యాం మధ్య ఉన్న నాగావళి నదిలోని ఇసుక దిబ్బల వరకు సుమారు 2.5 కిలోమీటర్ల మేర 10 టైర్లు, 18 టైర్లు గల టిప్పర్లు, లారీలు వెళ్లేందుకు వీలుగా తొలుత గ్రావెల్ రోడ్డు వేశారు. చినలంకాం, కాఖండ్యాం గ్రామాలకు చెందిన రైతుల జిరాయితీ భూముల్లో వారి అనుమతి లేకుండా బాట వేశారు. ఎన్ని వాహనాలు వచ్చినా పాడవకుండా రోడ్డు వేశారు. ఏకపక్షంగా ప్రభుత్వ పెద్దలమని చెప్పి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన వారు ఇక్కడ చిట్టి, శ్రీనివాసరావు తదితర వ్యక్తులతో రోడ్డు పని కానిచ్చేశారు.

తెరవెనక ప్రభుత్వ పెద్దలు?

- ఒక నదిలోకి అక్రమంగా గ్రావెల్ రహదారి వేశారు... అది కూడా రైతులకు తెలియకుండా జిరాయితీ భూముల్లో పక్కాగా నిర్మించారు. కళ్ల ముందు అనుమతి లేకుండా రోడ్డు వేసినా.... ఎందుకు వేశారు? ఎవరు వేశారు? అన్నదానిపై ఆరాతీయలేదు.
- అక్రమ రవాణా జరిగే ప్రాంతంగా గుర్తించి, ఆ రోడ్డును ధ్వంసం చేయడమో, ట్రెంచ్‌లు తవ్వడమో చేయాలి. కానీ, ఆ ప్రయత్నం చేయలేదు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారం విస్తృతంగా మీడియాలో ప్రచారం కావడంతో శుక్రవారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా ట్రెంచ్ తవ్వారు.
- ఇక, నదిలోకి భారీ వాహనాలు రావడం నేరం. అక్రమంగా ఇసుక తరలించేందుకు వచ్చిన వాహనాలను సీజ్ చేయాలి. కానీ, అది కూడా చేయలేదు. ఇసుక లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న వాహనాలు అన్నింటినీ ఖాళీగానే బయటికి పంపించేశారు. వాటిపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేయలేదు.
- ఇదంతా గమనిస్తే ఈ ర్యాంపు వెనక ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందనే అనుమానం కలుగుతోంది.
- వారి డైరెక్షన్‌లోనే తూతుమంత్రంగా చర్యలు చేపట్టి అక్కడి నుంచి వాహనాలను బయటికి పంపించేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చేశామన్నట్టుగా వ్యవహరించారు.
- బయట ప్రపంచానికి అంతా తెలిశాక అధికార వర్గాలు వ్యూహాత్మకంగా ఓ సంస్థ కోసం ఇక్కడ ర్యాంపు నిర్వహణకు అనుమతి వస్తుందని.. ఆ విషయం తెలుసుకుని భారీగా వాహనాలు వచ్చేశాయని.. అనుమతుల జాప్యం వల్ల గంటల తరబడి వాహనాలు అక్కడే ఉండిపోయాయని లీకులిచ్చాయి.
- కాసేపటికే అప్‌డేట్ వస్తుందని గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు అధికార వర్గాలు చెబుతూనే వచ్చాయి. ఇదంతా చూస్తుంటే పెద్దల ఇసుక అక్రమ రవాణా కోసం రకరకాల ప్లాన్లు వేస్తున్నట్టు స్పష్టమవుతోంది.



శుక్రవారం ఏర్పాటు చేసిన ట్రెంచ్

పకడ్బందీగా ప్రణాళిక..

రోడ్డు వేసిన రెండు రోజుల తర్వాత అంతా సవ్యంగా ఉందని నిర్ధారించుకుని గురువారం సాయంత్రం నుంచి ఇసుక ర్యాంపు నిర్వహణ ప్రారంభించారు. ఐదు జేసీబీలు, ప్రొక్లెయినర్‌లను తీసుకొచ్చి నదిలో ఇసుక తవ్వకాలు జరిపారు. తవ్విన ఇసుకను నదీ పరివాహక ప్రాంతంలో పోగేశారు. అంతా సిద్ధం చేశాక ఇసుక తరలించేందుకు భారీగా వాహనాలను రప్పించారు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వాహనాలు వస్తూనే ఉన్నాయి. ఈ ఒక్కరోజు 300కి పైగా వాహనాలు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. చుట్టు పక్కల నారాయణపురం, కొల్లివలస తదితర ప్రాంతాల్లో రవాణా వాహనాల తాకిడి ఎక్కువ కావడం, రోడ్లపై భారీగా తిరగడంతో స్థానికులు గమనించారు. సనపల సురేష్ అనే వ్యక్తి తొలుత మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ రవికుమార్ కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్, రెవెన్యూ, సెబ్, పోలీసు అధికారులను అప్రమత్తం చేసి అక్కడికి పంపించారు. వీర్లొచ్చేసరికే వందలాది వాహనాల్లో ఇసుక తరలిపోయింది. 100కి పైగా వాహనాలు నదిలోనూ, నారాయణపురం వంతెనపైన, కొల్లివలస గ్రామ రహదారిపై కనిపించాయి. పరిస్థితులను గమనించి వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేయించడమే కాకుండా భారీ వాహనాల్లో లోడింగ్ జరగకుండా అడ్డుకున్నారు. నదిలో నుంచి వాహనాలను బయటికి పంపించేశారు.

మమ్మల్ని అడక్కుండానే రోడ్డేశారు



మా గ్రామ పొలిమేరలో నాగావళి నదిలో ఇసుకను తరలించేందుకు ప్రొక్లెయినర్లు, పెద్ద ఎత్తున లారీలు రావడంతో గ్రామస్తులమంతా విస్మయం చెందాం. మా జిరాయితీ భూముల్లో అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తే సహించేది లేదు. అక్రమంగా ఎలా తరలిస్తారో చూస్తాం. వారి సంగతి తేలుస్తాం.

– బొల్లు సాంబమూర్తి, ఉప సర్పంచ్, మామిడివలస పంచాయతీ, కాఖండ్యాం గ్రామం, బూర్జ మండలం

శ్మశాన దిబ్బలనూ వదల్లేదు



మా జిరాయితీ భూముల్లో అనుమతుల్లేకుండా ఏకంగా నదిలోని ఇసుక ర్యాంపు వరకు అక్రమంగా గ్రావెల్‌రోడ్డు వేసేశారు. ఆ రోడ్డు మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కనీసం గ్రామ శ్మశాన వాటిక దిబ్బలను సైతం వదల్లేదు. వాటిలో కూడా తవ్వకాలు జరుపుతున్నారు. మా భూముల మీదుగా వెళ్లి ఇక్కడ ఇసుక ర్యాంపులు నిర్వహిస్తే సహించేది లేదు.

– కొయ్యాన జగన్నాథం, చిన్న లంకాం గ్రామం, బూర్జ మండలం

అక్రమంగా ర్యాంపు నడిపితే సహించం



అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు జరపడమేంటి? అనధికారికంగా తరలించడం సరికాదు. అక్రమంగా ఇసుక ర్యాంపులు నడిపితే ఊరుకునేది లేదు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తే మా గ్రామాలు ఏమైపోవాలి. ర్యాంపు నిర్వహణను అడ్డుకుంటాం. అవసరమైతే దేనికైనా సిద్ధపడతాం.

– సీర రంగారావు, గ్రామ సర్పంచ్ సత్యవతి భర్త, చిన్న లంకాం, బూర్జ మండలం.

అనుమతుల్లేవు..



బూర్జ మండలం నారాయణపురం నదీ తీరంలో కాఖండ్యాంలో ఇసుక తవ్వకాలకు, రవాణాకు అనుమతుల్లేవు. ఇక్కడి నుంచి ఇసుక రవాణా చేయకూడదని ఆదేశించాం. ఎవరికైనా అనుమతులు వస్తే వాటిని కార్యాలయంలో చూపించాకే తవ్వకాలు, రవాణా చేయాలి.

– జె.ఈశ్వరమ్మ, తహశీల్దార్, బూర్జ మండలం



నది తీరంలోని తోటల్లో దాచిన రోడ్డు రోలర్ (ఇన్‌సెట్లో) ఇసుక తవ్వకాల ప్రొక్లెయినర్



ఇసుక కోసం శుక్రవారం వచ్చిన వాహనాలు

స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎన్‌డీటీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ స్కానింగ్ కేంద్రాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలికలు తక్కువగా ఉన్న మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, పీడీ బి.శాంతిశ్రీ, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్, ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ సుజాత, ఇన్‌చార్జి డీఐఓ డాక్టర్ కె.వెంకటరావు, డీపీఎంఎ జి.వెంకటలక్ష్మి, డెమో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. –శ్రీకాకుళం పాతబస్టాండ్

10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

జిల్లాస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలతోపాటు రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపికలను ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎన్‌ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.ఝాన్సీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా 5 నుంచి 60 ఏళ్ల వయసు గల వారికి వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించి పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. గ్రూప్-1 నుంచి గ్రూప్-6 మధ్య 5 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయస్సు గల క్రీడాకారులకు పోటీలు నిర్వహించి రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈ నెల 7లోగా స్విమ్మింగ్ పూల్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజుగా రూ.200, ఈవెంట్‌కు రూ.50 చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 7093182259 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. –శ్రీకాకుళం న్యూకాలనీ

శాకంబరిగా నీలమణిదుర్గ



పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారు ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 500 కేజీల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలంకరించిన కూరగాయలతో శనివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. – పాతపట్నం

నేడు ఆర్‌జీయూకేటీ రెండో జాబితా విడుదల

శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ రెండో మెరిట్ లిస్టు శనివారం విడుదల కానుంది. ప్రత్యేక కేటగిరీ 45 సీట్లు మినహాయించి 1035 సీట్లకు గాను మొదటి విడత మెరిట్ లిస్టుకు గత నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా 863 మంది హాజరయ్యారు. 172 మంది గైర్హాజరయ్యారు. వీరికి సైతం మరో అవకాశం ఇచ్చారు. మరోవైపు క్యాంపస్ మార్పునకు సైతం ఆప్షన్ ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రత్యేక కేటగిరి ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. మొత్తం ఖాళీలకు రెండో విడత జాబితా శనివారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తారు. కాగా, ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19 నుంచి క్లాస్ వర్క్ ప్రారంభమవుతుందని ఆర్‌జీయూకే డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. – ఎచ్చెర్ల క్యాంపస్

బినామీ ఉద్యోగి నిర్వాకంపై విచారణ



విచారణ చేపడుతున్న ఉపవిద్యాశాఖాధికారి

మండల కేంద్రంలో పొందూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బినామీ ఉద్యోగి నిర్వాకంపై శుక్రవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి విచారణ చేపట్టారు. విద్యార్థినులకు వాట్సాప్ మెసేజ్‌లు పెట్టడంపై ఎస్పీకి ఫిర్యాదు వెళ్లడంతో ఇటీవల పోలీసులు విచారణ చేపట్టారు. దీనిపై వచ్చిన కథనాలకు ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఉపవిద్యాశాఖాధికారి సైతం విచారణ జరిపారు. మహిళా ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న సంఘటనలపై హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఉపవిద్యాశాఖాధికారి అసహనం వ్యక్తం చేశారు. విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. - పొందూరు



ఇచ్ఛాపురం రూరల్ : 170 అడుగుల జాతీయ జెండా వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్నేశుపేట విద్యార్థులు, ఉపాధ్యాయులు



శ్రీకాకుళంలో భారీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విద్యార్థులు

మురిసిన మువ్వన్నెల జెండా

భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళంలోని గాంధీ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు పింగళి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు అంబేడ్కర్ ఆడిటోరియం నుంచి శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం వరకు భారీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఇచ్ఛాపురం మండలం ఇన్నేశుపేటలో 170 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. – శ్రీకాకుళం అర్బన్/ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

పీజీ, బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్, బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌కు ఈ నెల 6 నుంచి 12 వరకు ఫీజు స్వీకరిస్తారు. పరీక్షలు 20వ తేదీన ప్రారంభమై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫీజు ఈ నెల 8 నుంచి 13 వరకు స్వీకరిస్తారు. పరీక్షలు 22 నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

కనిమెట్ట బ్రాంచి పోస్టాఫీసులో విచారణ



విచారణ జరుపుతున్న పోస్టల్ అధికారులు

పొందూరు : మండలంలోని కనిమెట్ట గ్రామంలో బ్రాంచి పోస్టాఫీసులో బీపీఎం ఆర్థిక అవకతవకలపై శుక్రవారం జిల్లా పోస్టల్ అధికారులు విచారణ జరిపారు. బీపీఎం లోకేష్ రెండు రోజులుగా కార్యాలయానికి రాకపోవడం, తమ ఖాతాల నిర్వహణపై అనుమానంతో గ్రామానికి చెందిన ఖాతాదారులు పోస్టల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.గౌరీశంకర్ రెండు రోజులుగా విచారణ జరుపుతున్నారు. రెండు నెలలుగా ఎస్‌బీ, ఆర్‌డీ అకౌంట్లకు నగదు జమచేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు గుర్తించారు. రూ. 50 వేలకు పైగా ఆర్థిక లావాదేవీలలో లోపాలను గుర్తించామని చెప్పారు. ఇంకా పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉందని తెలిపారు.

రిమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా లక్ష్మి



లక్ష్మిని అభినందిస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఎన్.వి.లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె రిమ్స్‌లోనే హెడ్ నర్సుగా పని చేస్తున్నారు. పదోన్నతిపై నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం లక్ష్మిని పలువురు నర్సులు, వైద్యులు, ఉద్యోగులు అభినందించారు.

నేడు కేంద్రమంత్రి రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీకాకుళంలోని తన స్వగృహానికి చేరుకుని, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం, డీఆర్‌ఎంలతో సమీక్ష నిర్వహిస్తారని, మధ్యాహ్నం 2:30 గంటలకు హోటల్ సన్‌రైజ్‌కు చేరుకుంటారని చెప్పారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ, అలింకో నిర్వహించే దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

కొట్లాటలో విద్యార్థికి గాయాలు

పొందూరు : మండల కేంద్రంలోని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పమ్మిన ధనుంజయ, వి.వెంకటరమణల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ధనుంజయకు చేయి విరగడంతో ఆసుపత్రి పాలయ్యాడు. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తరగతి గదిలో పుస్తకాల విషయంలో వివాదం జరిగిందని చెబుతున్నారు. ఇంటర్వెల్ సమయంలో మూత్ర విసర్జనకు జయటకు వెళ్లిన సమయంలో గొడవ మరింత పెరగడంతో ఈ కొట్లాట చోటుచేసుకుంది.

మాతా శిశు మరణాలు అరికట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాతా, శిశు మరణాలను అరికట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. మాత, శిశు మరణాలపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసును వైద్యులే పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా హైరిస్క్ కేసులను వైద్యాధికారులే చూడాలని, ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించవద్దన్నారు. ప్రసవం అయ్యే వరకు వైద్యులే పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ సంజీవని కిట్స్ పంపిణీని వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో మాతా మరణాలు 7, శిశు మరణాలు 11 నమోదైనట్లు చెప్పారు. సమావేశంలో గైనకాలజిస్టు కె.పార్వతి, ఇన్‌చార్జ్ డీఐఓ పి.వెంకటరావు, మండలాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్‌గా చదువుకుందాం

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- వయస్సుతో నిమిత్తం లేకుండా టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆగస్ట్ 27 వరకు అవకాశం



ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్(సార్వత్రిక విద్యాపీఠం) నోటిఫికేషన్ విడుదలైంది. చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారి స్కూల్/కాలేజీకి వెళ్లలేక.. ఇలా కారణమేదైనా విద్యకు దూరమైన వారికి బాసటగా నిలుస్తోంది ఓపెన్ స్కూల్. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నామమాత్రపు ఫీజుతో ఏపీ ఓపెన్ స్కూల్ దూరవిద్యను అందిస్తోంది. రెగ్యులర్ చదువుతో సమానమైన విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా సర్కారు ప్రోత్సహిస్తోంది.

అర్హులు వీరే..

రెగ్యులర్ విధానంలో పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన వారు, వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, బాలికలు, గృహిణులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, దిగువ స్థాయి ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా చేరవచ్చు. ఈ ఏడాది ఆగస్ట్ 31 నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. 15 ఏళ్లు పూర్తయి.. పదో తరగతి పాసైనవారు, ఇంటర్ మధ్యలో ఆపేసినవారు/ఫెయిలైనవారు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో దూర విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు. రెండేళ్ల ఇంటర్ విద్య అయినా, పదోతరగతైనా ఏడాదిలోనే పూర్తి చేసుకోవచ్చు.

నోటిఫికేషన్ విడుదల..

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తుల ప్రక్రియ జూలై 31న మొదలైంది. సమీపంలోని ప్రభుత్వ స్టడీ సెంటర్ దగ్గర వద్ద గానీ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌పోర్టల్‌లో గానీ ఆగస్ట్ 27లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు చెల్లించవచ్చు.

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానం

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందో లేదోననే అపోహ చాలా మందిలో ఉంది. అది పూర్తిగా అవాస్తవం. ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకున్న విద్య రెగ్యులర్ విద్యతో సమానమే. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. వీటితో ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని విద్యాశాఖాధికారులు, యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాస్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు నేరుగా అభ్యర్థుల చిరునామాకే పంపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఎస్ఎస్‌సీకి 47 స్టడీ సెంటర్లు, ఇంటర్మీడియెట్‌కు 28 స్టడీ సెంటర్లు ఉన్నాయి.
- దాదాపు ప్రతి మండలంలో అధ్యయన కేంద్రాలు ఉన్నాయి.
- ఆసక్తి గల వారికి ప్రవేశాలు కల్పించి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తోంది.
- అభ్యర్థులకు ఎంచుకున్న మీడియం ప్రకారం పాఠ్యపుస్తకాలను, మెటీరియల్స్ అందజేయనున్నారు.
- అడ్మిషన్ పొందిన వారు 30 తరగతులకు కచ్చితంగా హాజరు కావాలి. అలా అయితేనే పరీక్ష రాసేందుకు అర్హత కల్పిస్తారు.
- అడ్మిషన్ పొందిన వారికి ఉత్తీర్ణత సాధించేందుకు ఐదేళ్ల వరకు అవకాశం ఇస్తారు.
- టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలనుకునే వారు తెలుగు, ఇంగ్లీషుతోపాటు ఇతర మీడియంలలో కూడా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- ఇంటర్లో సైన్స్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ ఇతరత్ర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.
- ఓపెన్ స్కూల్ సొసైటీ సమాచారం తెలియజేసేందుకు, పాఠాల కోసం 'జ్ఞానధార' పేరిట ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌ను గత ప్రభుత్వం ప్రారంభించింది.

బాలికా విద్యకు ప్రోత్సాహం..

బాలికా విద్యను ప్రోత్సహించేలా ఓపెన్ స్కూల్ సొసైటీ అనేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక కారణాలు, సమీపంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో లేక వేలాది మంది బాలికలు, గృహిణులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అలాంటి వారికి ఫీజులో రాయితీ కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు, మాజీ సైనికుల పిల్లలకు కూడా ప్రవేశ రుసుం ఫీజులో రాయితీ కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసినవారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిది. టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి మంచి అవకాశం. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ తీసుకుని చదువుకు దూరమైన వారు ప్రవేశాలు పొందేలా చూడాలి.

– ఎస్.తిరుమల చైతన్య
జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



మాట్లాడుతున్న పెరియా జాగృతి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే నైపుణ్యాలు కీలకమని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు పెరియా జాగృతి అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ అన్న అంశంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో మాట్లాడారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ అనంతరం ఉన్నత ప్లేస్‌మెంట్, ఉన్నత విద్య లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఆత్మ విశ్వాసం, అనుకూల దృక్పథం ఉండాలన్నారు. ఇంజినీరింగ్‌లో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై పట్టు ఉండాలన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం కావటం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, డి.వెంకటరావు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కిరాణా దుకాణం దగ్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న కిరాణా దుకాణం గురువారం అర్థరాత్రి దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో చాలా వరకు సామగ్రి కాలిపోయింది. స్థానికులు స్పందించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్టు షర్క్యూట్ వల్ల జరిగిందా, ఇతర కారణాల వల్లా అన్నది తెలియరాలేదు. ఈ ఘటనపై దుకాణ యజమాని సీపాన హైమావతి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.



కాలిపోయిన షాపు

క్యాన్సర్ బాధిత చిన్నారికి సాయం



చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న కర్తలి గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్

కంచిలి : మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల చిన్నారి పైల రిషికేశ్ బ్లడ్‌క్యాన్సర్ బారిన పడటంతో 'పుత్ర భిక్ష పెట్టండి' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. చికిత్స నిమిత్తం సుమారు రూ.25లక్షలు వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో గ్రామస్తులు విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.4,02,400 సేకరించి ఆ మొత్తాన్ని చిన్నారి తల్లిదండ్రులకు శుక్రవారం విశాఖలోని ఆస్పత్రిలో అందజేశారు.

పొందూరు హైస్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు

పొందూరు: పొందూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావుకు జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న స్కూల్ చైర్మన్ ఎన్నికలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సెలవు పెట్టడంపై విద్యాశాఖాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై షోకాజు నోటీసు జారీ చేసినట్లు ఎంఈవో-1 పి.వి.రామరాజు తెలిపారు.

ఈఏపీసెట్ సాంకేతిక సమస్యలకు పరిష్కారం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్ – 2024 ఎంపీసీ ఇంజినీరింగ్ స్ట్రీం రెండో విడత సీట్ల కేటాయింపులు పూర్తిగాకా, ప్రస్తుత కొన్ని సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఫీజురీయింబర్స్ వర్తింపు సమస్యగా మారింది.

ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. సెల్ఫ్ రిపోర్టు పూర్తయ్యాక సమస్యలు ఉంటే విద్యార్థులు సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు శుక్రవారం తెలిపారు.

అమ్మో.. ఆ మూడు మండలాలా!

- ఆమదాలవలస, నందిగాం, సంతబొమ్మాళిలో తహసీల్దారు పోస్టులు ఖాళీ
- రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయని ముందుకు రాని అధికారులు
- ప్రస్తుత డీటీలకు పదోన్నతులు కల్పించేందుకు న్యాయపరమైన చిక్కులు
- డీపీసీ వచ్చే వరకు ఇన్‌చార్జ్‌లతో పాలన



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆమదాలవలస, నందిగాం, సంతబొమ్మాళిలో తహసీల్దారు పోస్టులు భర్తీకి నోచుకోలేదు. ఇక్కడి తహశీల్దార్లు ఇటీవలే ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం 39 మంది తహసీల్దార్లకు వివిధ మండలాల్లో పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. వీరంతా ఎన్నికల్లో భాగంగా జోన్–1లోని ఇతర జిల్లాలకు వెళ్లిన వారే. తిరిగి వారు జిల్లాకు రావడంతో పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే తహసీల్దార్లు తగినంత మంది లేకపోవడంతో పైమూడు మండలాలు మాత్రం ఖాళీగా మిగిలిపోయాయి. ఉన్నవారిలో ఎవ్వరూ ఈ మండలాలకు వెళ్లేందుకు ముందుకు రావడం లేదు. నందిగాం, సంతబొమ్మాళి మండలాలు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోనిది. ఇక ఆమదాలవలసలో ఎప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నా అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఆయా మండలాల్లో పనిచేయాలంటే వారు చెప్పిన పనులన్నీ చేయాల్సి ఉంటుందని, అందుకే ప్రస్తుతమున్న 39 మందిలో ఏ ఒక్కరూ ఈ మండలాలకు వెళ్లేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

– జిల్లాలో తహసీల్దార్ కేడర్ ఉద్యోగులు కరువయ్యారు. ఉన్న వారికి పదోన్నతి ఇస్తే తప్ప మూడు మండలాల్లో తహసీల్దార్ల భర్తీ సాధ్యం కాదు. అయితే ప్రస్తుతం ఉన్న డీటీలకు పదోన్నతులు కల్పించేందుకు న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఆయా మండలాల్లో డీటీలే తహసీల్దార్లుగా వ్యవహరిస్తున్నారు.

అడహక్ పదోన్నతులకు నిబంధనల అడ్డు..

మూడు మండలాలకు ముగ్గురు సీనియర్ డీటీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 160 డీటీల్లో పదోన్నతికి దగ్గరిలో ఉన్న వారు ముగ్గురు ఉన్నారు. వీరిలో ఇద్దరు గతంలో జరిగిన పదోన్నతుల్లో అవకాశం కోల్పోయారు. వారి జాబితాలు సీసీఎల్ఏకు వెళ్లకపోవడంతో ఖాళీలు ఉన్నా వారికి పదోన్నతులు రాలేదు. వారు ప్రస్తుతం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో వారికి ఈ మండలాల్లో అడ్‌హక్ పదోన్నతులు ఇచ్చేందుకు నిబంధనలు అడ్డు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. వారికి కాకుండా జూనియర్లకు పదోన్నతులు ఇచ్చి అడ్‌హక్ తహసీల్దార్లుగా నియమించినా సీనియర్లను నిర్లక్ష్యం చేసినట్లవుతుందని అధికారులు భావిస్తున్నారు.

డీపీసీ ఏర్పాటయ్యేనా..?

డిపార్టుమెంట్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) ఏర్పాటై జోన్ -1లో సీనియారిటీ జాబితా మేరకు రిజర్వేషన్లు అమలు చేయాల్సింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం డీపీసీ నిర్వహించే పరిస్థితిలో లేదు. బదిలీలు ప్రక్రియనే ఇంకా పూర్తి స్థాయిలో చేపట్టలేదు. ప్రస్తుతం ఐఏఎస్, ఐపీఎస్‌లో కొన్ని కేడర్లు మాత్రమే బదిలీలు జరిగాయి. సాధారణ బదిలీలు పూర్తయ్యాకే డీపీసీ నిర్వహించే అవకాశం ఉంది. అయితే ఈ బదిలీలు కూడా మరో రెండు నెలలు వరకు జరిగే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

రెవెన్యూ సేవలకు ఇబ్బంది..

రెగ్యులర్ తహసీల్దారు లేనందున ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. వారు కీలక నిర్ణయాలు తీసుకొనేందుకు ముందుకు రావడం లేదు. నామమాత్రం పనులు తప్ప భూముల వ్యవహారాలు, కోర్టు కేసులు, సర్వే, మ్యుటేషన్లు, భూ సేకరణ తదితర అంశాలలో చొరవ చూపడం లేదు. దీంతో రెవెన్యూ పరంగా పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని ఆయా మండలాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

● మిడత.. అద్భుతః



పలాస మండలం తర్లాకోటలో పురాతన కోట సమీపంలో ఓ మిడత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతిలో మిళితమై అద్భుతమైన రంగులతో ఆకట్టుకుంది. పచ్చదనం ఎక్కువగా ఉండటంతో విభిన్నమైన జీవరాశులకు ఈ ప్రాంతం నెలవుగా మారింది.

– కాశీబుగ్గ

కేజీబీవీ ప్రవేశాల్లో రిజర్వేషన్లు పాటించాలి

- కలెక్టర్‌ను కోరిన జిల్లా దళిత, ఆదివాసీ సంఘాలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 6–12 తరగతులు వరకూ జరుగుతున్న ప్రవేశాల్లో ఎస్సీ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని జిల్లా దళిత, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. గత నెల 29న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో కేజీబీవీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలుపై కలెక్టర్‌ను కలిసినా ఇప్పటి వరకు చర్యలు లేవని వివరించారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయడం లేదని చెప్పారు. 6–12 తరగతుల వరకు జరుగుతున్న అడ్మిషన్లపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, నాయకులు కొత్త ధర్మారావు, నపేడాడ కృష్ణారావు, రాకోటి రాంబాబు, టొంపల రమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం బలగలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ/డీఎల్‌టీసీ శిక్షణా సంస్థల్లో యువతీ యువకులకు అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ సెట్‌శ్రీ, జిల్లా ఉపాధి శిక్షణ సంస్థ, కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుల్లో సెట్‌శ్రీ సీఈఓ మాట్లాడుతూ 17 సంవత్సరాల ఆరు నెలల నుంచి 21 ఏళ్లలోపు యువతీ యువకులు అగ్నివీర్ వాయుసేనలో చేరేందుకు అర్హులని చెప్పారు. అనంతరం ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారులు, రిక్రూటింగ్ స్టాఫ్ కార్పొరేల్ ఎన్.సందీప్, దేవ్‌కాంత్ మిశ్రా, డిఫెన్సె సివిలయన్ నర్సింగ్ యాదవ్ యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కాగా, శనివారం శ్రీకాకుళం రూరల్ మండలం మునసబ్‌పేటలో ఉన్న గురజాడ గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, నరసన్నపేట, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని సీఈఓ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు, ఎన్‌వైకె యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్‌ఉజ్వల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నియామకాల్లో నిబంధనలకు పాతర

- విద్యుత్ శాఖ ఈఈ వైఖరిపై వైఎస్సార్ ఉద్యోగుల సంఘం అభ్యంతరం

అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజన్‌లో ఇటీవల ఆరుగురు అసిస్టెంట్ లైన్‌మేన్లకు లైన్‌మేన్లుగా పదోన్నతులు కల్పిస్తూ కేటాయించిన స్థానాల అంశంలో అధికారులు పూర్తిగా నిబంధనలకు పాతర వేశారని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రూరల్ ప్రాంతాల్లో పదేళ్లకు పైగా పనిచేసిన ఏఎల్ఎంలకు లైన్‌మేన్లుగా మళ్లీ రూరల్ ప్రాంతాలకే కేటాయించడాన్ని సంఘం రీజనల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైశ్యరాజు శ్రీనివాసరాజు, ఆర్.శ్రీనివాస్‌లు తీవ్రంగా తప్పుపట్టారు. డివిజన్ డీపీసీ చైర్మన్‌గా వ్యవహరించిన ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు తీసుకున్న నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. డీ–2 సెక్షన్‌లో పనిచేసిన ఏఎల్ఎంకు మళ్లీ డీ–2లోనే లైన్‌మేన్‌గా అవకాశమివ్వం ఏంటని ప్రశ్నించారు.

ఎక్కువ కాలం రూరల్ ప్రాంతాల్లో పనిచేసిన వారికి పట్టణ ప్రాంతాలను కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ సిలిండర్ లీక్

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురంలో వీరఘట్టం శివప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం వేకువజామున వంటలు చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ పైపులైన్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకాధికారి (ఎస్ఎఫ్ఓ) బి.సూర్యారావు, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



జామి చందన (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని విశాఖ-బి కాలనీలో షిర్డీ సాయి ఆలయ సమీపంలో నివాసముంటున్న జామి చందన (30) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త జామి శ్రీను చిరు వ్యాపారి. వీరికి కుమారుడు దేవిశ్రీప్రసాద్, కుమార్తె హారిక ఉన్నారు. చందన కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోందని, అనారోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

604 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం ప్యాకెట్లతో ఎస్ఈబీ అధికారులు

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్: మందస మండలం బేతాళపురం గ్రామానికి చెందిన పుక్కళ్ల దిలీఫ్, చెల్లూరి వెంకటేషలు అక్రమంగా తరలిస్తున్న 604 మద్యం టెట్రా ప్లాకెట్లను ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎంఆర్‌వీ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం మందస, పలాస, కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి మందస వైపు 90 ఎంఎల్ పరిమాణం గల 460 మద్యం టెట్రా ప్యాకెట్లు, మరో 180 ఎంఎల్ పరిమాణం గల 144 మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ పి.వి.గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.